# సారాహల్వార్

## కె.వి.నరేందర్

సారయ్యకి తిక్క తిక్కగా ఉంది.

దాదాపు పదిహేను రోజుల్నించి సారా చుక్క కూడా దొరక్క గొంతులో గరళాన్ని ఆపుకున్నంత బాధగా ఉంది. సారా వాసన కోసం ముక్కుపుటాలు విల విలా కొట్టుకుంటున్నాయి. కనీసం బ్లాకులోనైనా ఒక పాకెట్ దొరికితే బావుండేది అని ఆలోచిస్తున్నంతలో... బయట్నించి ఏవో అరుపులు వినిపించాయి.

"సారా మానండి... సౌఖ్యంగా జీవించండి"

"సారా పాకెట్టు... చావుకి తాకట్టు"

రోడ్డుమీంచి స్త్రీల ఉద్యమం ఉధృతంగా సాగిపోతోంది. సారయ్య ఓమారు బయటికొచ్చి చూసి పళ్ళు నూరుకున్నాడు. ఈ ఒక్కరోజుకీ తాగనిచ్చి రేపట్నించి ఈ ఉద్యమం మొదలెడితే బావుండునన్పించింది. కిటికీలోంచి ఊరేగింపుని చూస్తూనే ఉండిపోయాడు చాలాసేపు. మనసు నిండా గుప్పుమంటున్న ఆలోచనలు... తాగని ఈ పదిహేను రోజులనించీ తన శరీరంలో ఆరోగ్యకర మార్పులు స్పష్టంగా కన్పిస్తున్నప్పటికీ... తన భార్యా బిడ్డల్లో సంతోషం వెల్లివిరుస్తున్నప్పటికీ... గొంతు ఎడారిలా మారి సారా చుక్క కోసం మనసు ఘోషిస్తూనే ఉంది.

"ఏంటి నాన్నా... అలా చూస్తున్నావ్" కూతురు నీలిమ మాటల్తో ఈ లోకంలో పడ్డాడు సారయ్య. నీలిమ నవ్వుతూ చూస్తోంది తనవైపు.

"నీయవ్వ... నెల్లూరు జిల్లాలో ఎట్లా పుట్టిందో గాని, సారా వాసన లెక్కనే మనూరి దాకా గుప్పుమన్నది. ఆ ఆడజనాన్ని చూస్తుంటే తాగినోడు గనక ఎదురైతే సారాపాకెట్టుని పాదాలకిందేసి తపీమని తొక్కినట్టుగా నలిపేసేటట్టున్నారు..." అన్నాడు బీడీ ముట్టిస్తూ.

"అవును నాన్నా... సరిగా చూడు అమ్మకూడా ఆ జనంలోనే ఉంది..." అంది.

"ఓర్నాయనోయ్... దీనికిదేం పోయే కాలమే... నువ్వేజెప్పుంటావ్ అందులో జేరమని..," "ఊరంతా ఓదారైతే ఉలిపిరి కట్టెది మరోదారని... ఊర్లో ఆడవాళ్ళంతా వచ్చి అడిగాక అమ్మమాత్రం ఇంట్లో ఉండి ఏం చేస్తుంది. మంచి పనే కదాని ఉద్యమంలో చేరింది" అంది నీలిమ నవ్వుతూ.

"గట్లనా నీయవ్వ కాంట్రాక్టర్లు తయారుచేసిన సారానే గీ ఆడోళ్ళు బందువెడుతుండ్రు... ఇగ మనమే జేసేటియ్ గదాని గీ బీడీలు కూడా బందు పెడ్తరేమో... గీ ఆడోళ్లేంది... గిట్ల తయారైండ్రు..." అన్నాడు కాలుతున్న బీడీని ప్రేమగా చూస్కుంటూ.

"అదీ జరగొచ్చు నాన్నా..." అంది నీలిమ చెప్పులేసుకుంటూ, "నువ్వేటమ్మా... ఆ మీటింగ్ కాడబోయి ఉపన్యాసం ఇత్తావా?"


"అవున్నాన్నా... ఈ ఊర్లో ఈ ఉద్యమానికి ముందు నిల్చింది నేనే కదా... వీక్లీబజార్‌లో మీటింగ్‌లో మాట్లాడి దగ్గర్లోని ఓ సారాషాపు మీద దాడిచేయాల్సి ఉంది. చాలామంది యువకులు, సారా మానిన వాళ్ళొస్తున్నారు. నువ్వూ మానేసావ్ కద నాన్నా... మీటింగ్‌కి రాకూడదా?" అని అడిగింది నీలిమ.

నీలిమ సారా షాపు మీద దాడి అనగానే సారయ్య మెదట్లో దురాలోచన పుట్టింది. సారాడిపో మీద దాడి చేస్తున్నప్పుడే అందులో, తనూ దూరి ఒక్కపాకెట్టయినా ఎవరూ చూడకుండా తాగితే...?? ఈ ఆలోచన రాగానే బయటపడకుండా...

"అవేంటమ్మా... నీ చేతిలో ఉన్నవి" అడిగాడు మాటమారుస్తూ.

"అదే నాన్నా... నేను గ్రూప్ వన్ ఎగ్జామ్స్ పాసయ్యాను కదా. ఇంటర్వ్యూకి నా డిగ్రీ మెమోలిస్ట్, ఎనిమిది వందల రూపాయల డి.డితో పాటు నా బయోడేటా పంపమని రాశాను. ఆ ఫారమ్స్ ఫిలప్‌చేసి పంపిస్తున్నాను. అదే కవరు. ఈ కవరేమో... మరో ఉద్యోగానికి కూడా అప్లయ్ చేస్తున్నాను. ఈ గులాబి రంగు కవరేమో... అన్నయ్య కాబోయే వదినకి రాసిన మొదటి ప్రేమలేఖను కుంటాను..." అంది కిలకిలా నవ్వుతూ.

తనే తిరిగి "ఇప్పుడు మీటింగ్ కెళ్ళి... ఇవి సాయంత్రం పోస్ట్ చేస్తాను. నాన్నా... అదేంటోగాని మీరు సారా మాని ఉండకపోతే ఈ రోజు ఎనిమిది వందలు ఇచ్చేవారే కాదు నాన్నా. చాలాసార్లు డబ్బుల్లేక మనింటి



పరిస్థితులు మారిపోయాయి. ఈ సారి నేను ఉద్యోగానికి వెళ్తెట్టవుతానన్న నమ్మకం ఉంది నాన్నా...'' అంది కళ్ళల్లో కాంతి నింపుకొని.

కాని సారయ్య ఆలోచనలన్నీ పాకెట్ చుట్టే తిరుగుతున్నాయి.

'ఉల్లెమ్మా... నువ్వెళ్ళు నేను కాసేపాగి మీటింగ్ కాడికి వస్తా'' అన్నాడు మరో బీడీ ముట్టిస్తూ.

* * * *

నీలిమ ఆవేశంగా ప్రసంగిస్తోంది...

దాదాపు రెండువేల జనం ఉద్వేగంగా వింటున్నారు.

''... ఆరోజు సీతమ్మ తల్లి అడవుల పాలవడానికి కారణమెవరు? ఓ నిరక్షరాస్యుడు. ఓ త్రాగుబోతైన చాకలి. వాడే గనక ఓ నింద పుట్టించకపోతే రాముడు సీతని అడవులకు పంపేవాడా? ఒక్క త్రాగుబోతు మాటకి సీతమ్మ ఎన్ని కష్టాలు పడ్డదో, లవకుశల్ని తండ్రికి దూరంగా అడవిలో ఎంత దారుణంగా పెంచుకుందో ఆలోచించండి.''

సారయ్యకూడా వచ్చిన జనంలో కూచున్నాడు. కూతురి ప్రసంగానికి విస్మయంగా చూస్తూనే మరో ప్రక్క ఒక్క పాకెట్టుకోసం తహ తహలాడుతున్నాడు.

నీలిమ ప్రసంగానికి జనం మధ్యలో చప్పట్లు కొట్టారు. ఆ చప్పట్లు విని సారయ్య క్షణం పాటు పులకరించి పోయాడు. బిడ్డని చూసి గర్వమేసింది.

నీలిమ కొద్ది క్షణాలాగి తిరిగి మొదలెట్టింది.

''మన భారతంలోనూ, ముస్లింల ఖురాన్ లోనూ దాదాపు ఒకే పోలిక ఉన్న ఒక కథ ఉంది. అది త్రాగుడుకు సంబంధించింది. మనిషిని సారా అనేది ఎంత దారుణమైన స్థితికి దిగజారుస్తుందో తెలుపుతుందా కథ. ఇక్కడ పాత్రల పేర్లు అనవసరం కాబట్టి క్లుప్తంగా మన భాషలో దాన్ని మీకు చెప్తాను.

మంచి తనంతో బ్రతుకుతున్న ఒక మగాణ్ణి ఒక ఆడది విపత్కరమైన కోరిక కోరింది. అతడి ముందు సారా పానీయాన్ని ఉంచి, అతడి ప్రక్కనే తన నాలుగు నెలల పసిపాపని పడుకోబెట్టి, ఆమె అతడి ఎదురుగా నిల్చొని ఒక కోరిక కోరింది.

మధ్యపానమైనా సేవించు...

లేదా...

కత్తితో ఆ పాపని దారుణంగా చంపేయ్.

లేదా...

నన్ను అనుభవించు... అంది.

ఆ మంచి వ్యక్తి పరాయిస్త్రీని అనుభవించటమూ అని తల దించుకున్నాడు. ఆ వెంటనే కత్తితో పొడిచి ఆ పసికందుని చంపటమూ... అయ్యయ్యో ఎంత దారుణం అని కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

మద్యపానం సేవిస్తే...??? అన్న ఆలోచన తనకు తప్ప ఎవరికీ దానితో హాని కలుగదన్న భావన, వెంటనే మద్యపానాన్ని త్రాగాడు.

నిషా ఎక్కాక అక్కడి యువతి అందంగా కన్పించింది. నిషా కళ్ళలోకి కామాన్ని నింపింది. తూలుతూ ఆమెపై పడ్డాడు. బలవంతంగా ఆ



స్త్రీని అనుభవించాడు. ఆ అనుభవం మధ్యలో పాలకోసం ఏడ్చిన పాపని చిరాకుతో కత్తితో పొడిచేశాడు.

చూశారా... సారా తాగక ముందున్న మంచితనం తాగిన తర్వాత ఎలా మంటగల్సి పోతుందో...''

నీలిమ ప్రసంగానికి ఈ సారి విపరీతమైన చప్పట్లు... నినాదాలు మరోసారి ఆకాశాని కెగిశాయి.

స్వర్గంలో సురాపానం సేవిస్తున్న దేవతలకు కూడా విన్పించి కలవర పరచినంత బిగ్గరగా నినాదాలు మిన్ను ముట్టాయి. వెంటనే ఆ జనం దగ్గర్లోని సారాడిపోపై పడ్డారు. తామరాకు పాదాలు ఇనుప పాదాలుకాగా సారా పొట్లాలు గాలి బుడగల్లా చిట్లి పోయి చిన్నసైజు కాల్వలు పారుతున్నాయి.

సారయ్య ఆ వాసనని ఓ మారు గుండె ల్నిండా పీల్చుకున్నాడు. ఎవరి హడావిడిలో వారున్నారు. తను కొన్ని సారా పొట్లాలని తొక్కి చిదిపేశాడు. ఎవరూ చూడకుండా దాదాపు పది పన్నెండు పొట్లాలు పొడవైన అంగిజేబులో వేసుకొని నినాదాలిమ్చుకుంటూనే నిదానంగా జారుకున్నాడు.

ఉద్యమం ఊపులో పడి ముందుకు సాగిపోవడమేగాని... ఉద్యమంలో కల్పిగండి కొట్టే వాళ్ళ గురించి కూడా జాగ్రత్తపడి కనిపెట్టడం ఉద్యమకారుల మొదటి పని.

అందుకే... పారా హుషార్!

సారీ... సారా హుషార్!!

* * * *

రాత్రి దాదాపు ఎనిమిది గంటలు దాటుతోంది.

రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. వీధి బల్బులు అక్కడక్కడా వెలుగు తున్నాయి. సారయ్య గాల్లో తేలిపోతున్నాడు. అడుగులు అతడి ఆధీనంలో లేకుండా పడిపోతున్నాయి. మళ్ళీ ఎలాగూ దొరకవని తాగిన పాకెట్లు విపరీతంగా నిషాలో ముంచగా... ఉద్యమాన్ని తిడుతూ అడుగులేస్తున్నాడు.

ఇంకా జేబులో నాలుగు పాకెట్లున్నాయి.

వాటినోసారి తడిమిచూసుకొని ఇంటికెళ్ళే లోపే తాగాలని ఆలోచిస్తూ నడుస్తున్నాడు. కాని కాళ్ళు సహకరించడం లేదు. కాసేపు కరెంటు స్థంభానికానుకుని జారగిలబడ్డాడు. మళ్ళీ లేచి నడుస్తుంటే... వెనకేదో అలికిడిలా విన్పించి తిరిగి కనురెప్పలు బరువుగా పైకెత్తి తూలి పోతూ చూశాడు. ఎవరూ కన్పించలేదు. కాని



**మళ్ళొస్తున్న భానుప్రియ**

మేధావులభిమానాన్ని సామాన్యుల అనురాగాన్నీ ఆదరాన్ని పంచుకుని పెంచుకోలేక పోయిన భానుప్రియ తమిళ రంగంవైపు వెళ్ళిపోయింది.

ఇప్పుడీ సంవత్సరం చివర్లో అంటే డిసెంబర్ 30న అమూల్య ఆర్ట్స్ పతాకంపై రూపొందించే భరద్వాజ్ చిత్రంలో సుమన్ సరసన నటించడానికి తెలుగుపరిశ్రమకు వస్తుంది.

మళ్ళీ భాను 'ట్రెండ్' ప్రారంభ మవుతుందేమో చూడాలి!

కొంత మసకచీకట్లో ఎవరో ఉన్నట్టు అన్పించి అక్కడికెళ్ళాడు.

"ష్...ష్... ఎవర్నువ్వు...'' మాట తడ బడింది.

మరోసారి అడిగాడు.

ఏ ప్రతిస్పందనా రాకపోయే సరికి పూర్తి దగ్గరగా వెళ్ళి ముట్టుకున్నాడు.

నిలువెల్లా తడిమాడు

అది పోస్టుడబ్బా...

అది నోరు తెరచుకుని నవ్వుతున్నట్లుగా తోచింది సారయ్యకి...

"ఏంటీ... నీకూ... షారా...క్కావాలా?''

అన్నాడు.

"నవ్వుతావేంటి... మాటాడు'' గదమాయించాడు - కాసేపటికి... దాదాపు నాలుగడుగులెత్తున్న పోస్టుడబ్బాని గట్టిగా కౌగిలించుకొని "నువ్వు... నేనూ ఒకటే... నీకో పాకెట్టిస్తా...'' అని జేబులోంచి తీసి సారా పాకెట్టు ఇవ్వబోయాడు.

అది తీస్కో లేదు.

"ఏంటీ... తీస్కోవా... మరి నేను తా...గిం...చా...లా...'' అని పటుక్కుమని పళ్ళతో కొరికి బాక్సులో చెయిపెట్టి సారాని బాక్సులో పోశాడు.

తర్వాత మరో పొట్లాం.

తూలి పడబోయి నిలదొక్కుకుంటూ మరో పొట్లం... నాలుగు పొట్లాలని చించి పోస్టు బాక్సులో పోశాడు.

"మరి నేను పోతా... నా పెళ్ళానికీ, కూతురికీ సెప్పకు... శభాష్...'' అని కొద్ది దూరం పోయే సరికి మరో ఆలోచనొచ్చింది. వెంటనే తడబడుతూ పోస్టు డబ్బా దగ్గరికి తిరిగొచ్చాడు.

"ఏంటి... నీకు నిషా ఎక్కలేదా...'' అనడిగాడు.

"సెప్పమంటుంటే... నిషా ఎక్కిందా లేదా... ఏంటీ ఎక్కలేదా... ఇప్పుడెక్కుద్ది సూడు...'' అంటూ జేబులోంచి అగ్గిపెట్టె తీసి అతికష్టమ్మీద పుల్లగీసి పోస్టుడబ్బాలో పడేసి, నోటికొచ్చిన పాట పాడుతూ చీకట్లో కల్సి పోయాడు.

ఎందరో...

కష్ట సుఖాల్ని కడుపులో దాచుకున్న పోస్టుడబ్బా అగ్నికీలలు విరజిమ్మింది. అక్షరాల్ని పొదివికొని ఊసులాడుకుంటున్న ఉత్తరాలు... గర్భంలోనే చచ్చిపోతున్న శిశువుల్లా గమ్యాన్ని తల్చుకుంటూ గతించాయి.

ఫలితంగా... ఎన్ని జీవితాలో బుగ్గి పాలయ్యాయి.

* * * *

మర్నాడు...

పోస్టుమాన్ చెప్పిన వార్త ఊరంతా కది లించింది. కాని ఎవరు చేశారో తెలీదు. విషయం తెల్సిన నీలిమ మొహమ్మీద చేతు లుంచుకొని బిగ్గరగా ఏడ్చింది. నీలిమ దుఃఖం చూసి సారయ్య గుండె తరుక్కు పోయింది.

"చాలా గొప్ప ఉద్యోగమొస్తుందనుకున్నాను నాన్నా... నా జీవితంలో మంచి అవకాశం పోయింది. ఇంకెందరి జీవితాలు ఆ పోస్టు డబ్బాలో కాలిపోయాయో... నేనైతే చాలా దురదృష్టవంతురాల్నమ్మా... నేనింకా బతక కూడదేమో...?'' తలని గోడకేసి బాదు కుంటున్న నీలిమని ఆపటం తల్లికీ, అన్నకీ తమ్ముడికి కూడా సాధ్యపడటం లేదు.

సారయ్య స్వేదరంధ్రాల్లో కూడా కూరుకు పోయిన నిషా ఆవిరైపోతుంది. నీలిమ రోద గుండెను కుదిపేస్తుంటే... కూతుర్ని వారించబోయి తనూ పశ్చాత్తాపంతో దుఃఖాన్ని తట్టుకోలేక రోదిస్తూ కుప్పకూలిపోయాడు.

అదీ నీలిమ కాళ్ళ మీద...

సారా ఉద్యమ మూర్తి పాదాల మీద...

(ఒక యధార్ధ సంఘటన ఆధారంగా) ○

పల్లకి వినూత్న వారపత్రిక 29-12-93